సాక్షి
కర్నూలు
గురువారం, 10, అక్టోబర్, 2024



మానసిక కల్లోలం

మానసిక వ్యాధిగ్రస్తులు పెరుగుతున్నారు. నిరుద్యోగం, కుటుంబ సమస్యలు, చదువు, ఉద్యోగ ఒత్తిళ్లే కారణమని తెలుస్తోంది. కొందరు ముందే గుర్తించి వైద్యులను ఆశ్రయిస్తున్నారు. ..10లో



అలరించిన నృత్య ప్రదర్శన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ నిత్యకళావేదికపై బుధవారం హైదరాబాద్‌కు చెందిన ఆర్ట్స్ ఇన్‌స్టిట్యూట్ వారి కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను అలరించింది.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం (అడుగులు)	:1,633
ప్రస్తుతం	:1,632
సామర్థ్యం (టీఎంసీలు)	:105.788
ప్రస్తుతం	:101.773
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:10,99
అవుట్ ఫ్లో	:10,573

న్యూస్‌రీల్

నేడు ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలు

కర్నూలు(అర్బన్): జాతీయ తపాలా వారోత్సవాల్లో భాగంగా గురువారం జిల్లాలోని పలు తపాలా కార్యాలయాల్లో ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు పోస్టల్ సూపరింటెండెంట్ జీ జనార్దన్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పత్తికొండ, డోన్, ఎమ్మిగనూరు తపాలా కార్యాలయాల్లో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు ఆధార్ కేంద్రాలు పని చేస్తాయన్నారు. ఆధార్ కార్డుల్లో సవరణలు, కొత్తగా నమోదు, ఫోన్ నంబర్ లింక్, పేర్లు, చిరునామా మార్పులు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సకాలంలో టీకాలు వేయించాలి

కర్నూలు(హాస్పిటల్): గర్భిణులు, చిన్నారులకు సకాలంలో తప్పనిసరిగా టీకాలు వేయించాలని జిల్లా మాస్ మీడియా అధికారి శ్రీనివాసులుశెట్టి అన్నారు. బుధవారం స్థానిక కల్లూరు ఎస్టేట్‌లోని ముజఫర్‌నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలో నిర్వహిస్తున్న వ్యాధినిరోధక టీకాల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమం తప్పకుండా ఐదేళ్ల వరకు టీకాలు వేస్తే ప్రమాదకర వ్యాధుల నుంచి చిన్నారులను కాపాడుకోవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ సమీపంలోని ఆరోగ్య కేంద్రానికి వెళ్లి చిన్నారులకు టీకాలు వేయించాలని సూచించారు. ఈ మేరకు ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, సచివాలయ ఆరోగ్య కార్యకర్త మంజుల, ఆశా కార్యకర్త ప్రసన్నలక్ష్మి పాల్గొన్నారు.

డీసీసీబీ వెలుగోడు బ్రాంచ్ మేనేజర్ సస్పెన్షన్

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార కేంద్రబ్యాంకులో అక్రమాలు రోజుకొకటి వెలుగు చూస్తున్నాయి. తాజాగా వెలుగోడు బ్రాంచ్ మేనేజర్ నారాయణరెడ్డిపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు ముఖ్య కార్యనిర్వహణాధికారి విజయకుమార్ సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారు. వెలుగోడులోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్)ను మల్టీపర్పస్ సర్వీస్ సెంటరుగా అభివృద్ధి చేసేందుకు రూ.10 లక్షలు విడుదల చేసింది. బ్రాంచ్ ద్వారా పీఏసీఎస్‌లో నిధులు విడుదల చేస్తారు. అయితే బ్రాంచ్ మేనేజర్ అత్యుత్సాహంతో ఏకంగా రూ.20 లక్షలు ఈ ఏడాది మార్చిలోనే విడుదల చేశారు. అదనంగా రూ.10 లక్షలు ఇచ్చిన విషయంపై ప్రధాన కార్యాలయానికి కనీస సమాచారం కూడా ఇవ్వలేదు. ఈ విషయం వెలుగులోకి రావడంతో వెంటనే విచారణ జరిపించి వాస్తవమేనని తేలడంతో వేటు పడింది. ఈయన కొన్నేళ్లుగా వెలుగోడు బ్రాంచ్‌ను వదలకుండా అక్కడే కొనసాగుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. బదిలీ చేసినా రాజకీయ పలుకుబడి ఉపయోగించి తిరిగి అక్కడికే వెళ్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

విద్యుత్ కొత్త సర్కిళ్లకు ఎస్‌ఈల నియామకం

కర్నూలు న్యూసిటీ: ఏపీఎస్‌పీడీసీఎల్ పరిధిలో కొత్తగా ఏర్పాటైన నాలుగు విద్యుత్ సర్కిళ్లకు నూతన పర్యవేక్షక ఇంజినీర్లు నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సంతోషరావు ఉత్తర్వులు జారీ చేశారు. తిరుపతి కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న నలుగురు జీఎంలను ఎస్‌ఈలుగా బదిలీ చేశారు. ఆర్.రామచంద్రారెడ్డిని అన్నమయ్య సర్కిల్‌కు, ఎస్.కె.ఇస్మాయిల్ చిత్తూరుకు, జి.సుధాకర్ కుమార్ నంద్యాలకు, ఎం.సురేంద్ర శ్రీ సత్యసాయి సర్కిల్‌కు బదిలీ చేసి పోస్టింగ్ ఇచ్చారు.

సాగునీటి వినియోగదారుల సంఘం ఎన్నికల షెడ్యూల్ విడుదల

కర్నూలు కల్చరల్: సాగునీటి వినియోగదారుల సంఘం ఎన్నికల షెడ్యూల్ బుధవారం విడుదలైంది. ఈనెల 16వ తేదీన ఎన్నిక నోటిఫికేషన్ విడుదల కానుంది. నవంబర్ 16, 19, 22 తేదీల్లో మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఎన్నికల నిర్వహణకు నీటిపారుదల శాఖ, రెవెన్యూ శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు.

టెట్‌కు 304 మంది గైర్హాజరు

కర్నూలు కల్చరల్: ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) నిర్వహణ కోసం జిల్లాతో పాటు, హైదరాబాదులో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో బుధవారం జరిగిన పరీక్షకు 304 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. ఉదయం జరిగిన మొదటి సెషన్‌కు 1,611 మందికి 1,472 మంది హాజరు కాగా 139 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన రెండో సెషన్‌కు 1,613 మందికి 1,448 మంది హాజరు కాగా 165 మంది గైర్హాజరైనట్లు విద్యాశాఖ అధికారులు వెల్లడించారు.

నూతన మద్యం పాలసీతో కిక్కు మీద ఉన్న తెలుగు తమ్ముళ్లకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మరింత కలిసివచ్చేలా ఉంది. మరో రెండు రోజులు గడువు దక్కడంతో సిండికేట్‌లో ఆరితేరిన నాయకులు దరఖాస్తుదారులను సిట్టింగ్‌కు ఆహ్వానిస్తున్నారు. దుకాణాలకు పోటీ వచ్చే వారితో రాయబేరానికి పావులు కదుపుతున్నారు. సమయం లేదు మిత్రమా అంటూ.. కుదిరితే వాటా.. లేదంటే గుడ్‌విల్ అని ఆఫర్లు ఇస్తున్నారు. తమను కాదని వ్యాపారం చేయలేవంటూ టీడీపీ నేతలు బెదిరింపులకు పాల్పడుతున్నారు.

– సాక్షిప్రతినిధి కర్నూలు



మద్యేమార్గం.. రాయబేరం

ఇది సిండికేట్ సమయం

- మద్యం దుకాణాలకు ఈ నెల 11 వరకు దరఖాస్తు గడువు పొడిగింపు
- సిండికేట్‌కు మరింత మేలు చేసేలా ప్రభుత్వ నిర్ణయం
- వ్యాపారులను పిలిచి మాట్లాడేందుకు మరింత అవకాశం
- పెట్టుబడి లేకుండా 25–30 శాతం వాటా అడుగుతున్న కొందరు ఎమ్మెల్యేలు
- ఎమ్మెల్యేలు, టీడీపీ నేతల డిమాండ్లతో వ్యాపారుల బెంబేలు
- ఆళ్లగడ్డ, శ్రీశైలంలో నేతల డిమాండ్లతో మద్యం వ్యాపారులకు ఇక్కట్లు
- పలుచోట్ల ఎమ్మెల్యేలకు బెదరకుండా దరఖాస్తులు

అక్టోబర్ నెల ఆరంభం నుంచే అంతటా ఒకటే చర్చ! మద్యం షాపులు ఎలా దక్కించుకోవాలి? నేతల డిమాండ్లు ఏంటి? సిండికేట్ అవుతున్నారా? సిండికేట్‌లో ఉన్న షరతులు ఏంటి? అనే చర్చ నడుస్తోంది. 'సిండికేట్' ద్వారా దుకాణాలన్నీ తమ గుప్పిట్లో పెట్టుకుని టీడీపీ నేతలు, కార్యకర్తలకు మేలు చేయాలని ఎమ్మెల్యేలు భావించారు. కొన్ని చోట్ల వారి వ్యూహం ఫలిస్తే...ఇంకొన్ని చోట్ల బెడిసికొడుతోంది. ఈ క్రమంలో ఈ నెల 11 వరకు ప్రభుత్వం దరఖాస్తుల గడువు పొడిగించింది. ఇది 'సిండికేట్'కే మేలు చేసేలా ఉందని ఓ వైపు విమర్శలు వ్యక్తమవుతుంటే, మరోవైపు టీడీపీ నేతల బెదిరింపులకు లొంగకుండా మరి కొందరు వ్యాపారులు దరఖాస్తులు చేసుకునేందుకు అవకాశం దక్కింది! మద్యం విక్రయాలపై ప్రభుత్వం నూతన పాలసీ ప్రకటించడంతో మద్యం వ్యాపారులు దరఖాస్తులకు పోటీ పడ్డారు. అయితే దరఖాస్తు ప్రక్రియ మొదలు కాకుండానే పలు నియోజకవర్గాల్లో టీడీపీ నేతలు మద్యం వ్యాపారులను పిలిచి 'సిండికేట్' అయ్యేలా చర్చలు జరిపారు. కొన్ని చోట్ల 'సిండికేట్'కు అనువుగా అడుగులు పడితే, మరికొన్ని చోట్ల ఎమ్మెల్యేల ఉచిత కోరికలతో తమకు గిట్టుబాటు కాదని వ్యాపారులు వెనకడుగు వేశారు. జిల్లాల వారీగా దరఖాస్తుల ప్రక్రియ, సిండికేట్ వ్యవహారం తదితర అంశాలపై టీడీపీ పెద్దలు సమీక్షించి రెండు రోజులు గడువు పెంచేలా ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ప్రభుత్వం ఈ నెల 11 వరకు దరఖాస్తుల గడువు పెంచింది. ఈ నెల 9 వ తేదీ వరకు ఉమ్మడి జిల్లాలో 204 మద్యం దుకాణాలకు 3,500కు పైగా దరఖాస్తులు చేసుకున్నారు. అంటే సగటున ఒక్కో దుకాణానికి 17 దరఖాస్తులు వేశారు. పెంచిన గడువుతో వ్యాపారులు కూడా ధైర్యం చేస్తున్నారు. టీడీపీ నేతలతో సంబంధం లేకుండా కొందరు వ్యాపారులు దరఖాస్తులు వేసేందుకు సిద్ధమయ్యారు. షాపులు దక్కించుకున్న తర్వాత టీడీపీ నేతల డిమాండ్ల సంగతి చూద్దాం! అనే యోచనలో ముందడుగు వేశారు.

సయోధ్య కుదరక..

బనగానపల్లె, పత్తికొండ, నంద్యాల, ఎమ్మిగనూరు, ఆదోని, నందికొట్కూరు, పత్తికొండ, ఆలూరు, మంత్రాలయం నియోజకవర్గాల్లో సిండికేట్‌కు ప్రయత్నిస్తే టీడీపీ ఎమ్మెల్యే డిమాండ్లకు, వ్యాపారులకు సయోధ్య కుదర్లేదు. ఎలాంటి పెట్టుబడి లేకుండా వ్యాపారంలో వాటా అడగడం, నమ్మకమైన వ్యక్తులకు 'సిండికేట్' పెత్తనం అప్పగించకపోవడం తదితర కారణాలతో వ్యాపారులు తొలుత దరఖాస్తులకు వెనకడుగు వేశారు. అయితే పోటీలో నిలబడి లైసెన్స్ దక్కించుకుంటే ఆపై నేతల డిమాండ్ల సంగతి చూడొచ్చని వ్యాపారులు చర్చించుకున్నారు. 10–15 మంది వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి దరఖాస్తులు వేద్దాం! లైసెన్స్ వచ్చిన తర్వాత చూద్దాం అని టీడీపీ నేతలకు బెదరకుండా దరఖాస్తులు వేస్తున్నారు. అయితే ఎమ్మెల్యేలు కూడా వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. లైసెన్స్ దక్కించుకున్న వారు దుకాణం నడపాలంటే తమను సంప్రదించాల్సిందే కదా! లైసెన్స్‌లు దక్కించుకున్న వారితో ఓ సిండికేట్ ఏర్పాటు చేసి అప్పుడు వాటాల సంగతి తేల్చొచ్చు అనే యోచనలో ఉన్నారు. లైసెన్స్ ఫీజు, ఖర్చులు కలిపితే వ్యాపారులు లాభం చూడాలంటే 'వయొలేషన్' చేసి ధరలు పెంచాలి. అలా జరగాలంటే ఎక్సైజ్, స్థానిక ఎమ్మెల్యే మద్దతు ఉండాలి. అది జరగాలంటే వ్యాపారులు తమతో కలిసి మాట్లాడుకోవాలి. కాబట్టి ముందే గాబరాపడాల్సిన అవసరం లేదనే ధోరణిలో వీరంతా ఉన్నారు.

తెరపైకి 'షేర్' పాలసీ..

ఆళ్లగడ్డ నియోజకవర్గంలో 19 దుకాణాలు ఉన్నాయి. ఇవన్నీ 'సిండికేట్' అయ్యేందుకు ఓ ముఖ్యనేత చర్చలు జరిపారు. 19 దుకాణాలకు రూ.4కోట్లు 'గుడ్‌విల్' ఇవ్వాలని అడిగినట్లు తెలుస్తోంది. దీనికి వ్యాపారులు ఒప్పుకున్నారు. ఆపై దుకాణాలు దక్కించుకున్న తర్వాత ఆదాయంలో 25 శాతం వాటా తమకు ఇచ్చి, తక్కిన 75శాతం వాటాను అందరూ తీసుకోవాలని సూచించారు. ఈ ప్రతిపాదనతో వ్యాపారులు ఒక్కసారిగా ఉలిక్కిపడి కుదరదని చెప్పేశారు. దీంతో ఆ ముఖ్యనేత హైదరాబాద్‌లోని ఓ వ్యాపారికి ఆళ్లగడ్డ సిండికేట్ అప్పగించేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. వారు గుడ్‌విల్‌గా రూ.5కోట్లు చెల్లించేందుకు సిద్ధమైనట్లు సమాచారం. అయితే టీడీపీలో క్రియాశీలకంగా పని చేసిన నేతల నుంచి వ్యతిరేకత రాకుండా ఆ ముఖ్యనేత ఓ ప్రతిపాదన పెట్టినట్లు తెలుస్తోంది. సిండికేట్‌ను భాగాలుగా విభజించి, ఒక్కో షేర్ ధర



రూ.12 లక్షలుగా నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఎన్ని షేర్లు కావాలంటే ఆ లెక్కన డబ్బులు చెల్లించి వ్యాపారంలో భాగం ఉండొచ్చని చెప్పారు. ఈ ప్రతిపాదనపై కూడా టీడీపీ నేతలు ఆలోచనలో పడ్డారు.

అంతటా.. వాటా !

శ్రీశైలం నియోజకవర్గంలో 17 మద్యం దుకాణాలు ఉన్నాయి. ఇక్కడ దుకాణాలు దక్కించుకునేందుకు సిండికేట్‌కు యత్నించి విఫలం అయ్యారు. దీంతో అక్కడి ఓ టీడీపీ నేత వ్యాపారంలో 30శాతం వాటా అడిగినట్లు తెలుస్తోంది. దుకాణాలు ఎవరు దక్కించుకున్నా తనకు అభ్యంతరం లేదు, లైసెన్స్ వచ్చిన తర్వాత తనను కలిసి 'వాటా' మాట్లాడుకుని దుకాణం తెరవాలని హుకుం జారీ చేసినట్లు తెలుస్తోంది.

- ➢ కర్నూలులో ఓ మాజీ మంత్రి సోదరుడు సిండికేట్‌కు ప్రయత్నించినా కుదర్లేదు. దీంతో దుకాణాలు దక్కించుకున్న తర్వాత వ్యాపారులతో చర్చలు జరిపి 'సిండికేట్'గా ఏర్పడి ధరలు పెంచుకుని విక్రయాలు సాగించేలా నిర్ణయం తీసుకున్నారు.
- ➢ డోన్ నియోజకవర్గంలో టిక్కెట్ ఆశించి భంగపడిన ఓ నేత 16 దుకాణాలకు దరఖాస్తులు వేసినట్లు తెలుస్తోంది. అయితే అక్కడి కీలక ప్రజాప్రతినిధి వర్గానికి, ఈయన వర్గానికి మధ్య పోటీ నడుస్తోంది. అయితే దుకాణాలు దక్కించుకున్న తర్వాత మాట్లాడి వాటాలు నిర్ణయిస్తామని ఓ ఎక్సైజ్ అధికారి ప్రజాప్రతినిధికి చెప్పినట్లు తెలుస్తోంది.
- ➢ కోడుమూరులో ఇద్దరు నేతల మధ్య తీవ్ర విభేదాలు ఉన్నాయి. వీరి విభేదాలతో ఇక్కడ పోలీసులతో పాటు ఎక్సైజ్ పోలీసులకు తలనొప్పిగా మారింది. ఇద్దరి మధ్య అధికారుల పరిస్థితి అడకత్తెరలో పోకచెక్కలా తయారైంది. ఇక్కడ ఎమ్మెల్యే నామమాత్రంగా ఉన్నారు. దుకాణాలు దక్కించుకునేందుకు ఇద్దరూ పోటీ పడుతున్నారు. అయితే అధికారులు 'ఎమ్మెల్యే'కు సన్నిహితుడైన నాయకుడికి అనుకూలంగానే వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది.

నాణ్యత లేని విత్తనాలు మాకొద్దు

- పప్పు శనగ విత్తనాలను తిరస్కరించిన రైతులు
- 250 క్వింటాళ్ల విత్తనాలను వెనక్కి పంపిన అధికారులు



నాసిరకంగా ఉన్న శనగ విత్తనాలు



విత్తన లోడును వెనక్కి పంపుతున్న దృశ్యం

ఆస్పరి: ప్రభుత్వం నాణ్యత లేని శనగ విత్తనాలను పంపిణీ చేయడంతో రైతులు తిరస్కరించారు. ఆస్పరి మండలంలో రబీలో సాగు చేసేందుకు పప్పు శనగ విత్తనాల కోసం రిజిస్టర్ చేసుకున్న రైతులకు ప్రభుత్వం పంపిన విత్తనాలను టీడీపీ నాయకుడు వీరభద్రగౌడ్ చేతులమీదుగా బుధవారం పంపిణీ చేశారు. దాదాపు 500 మంది రైతులు 800 క్వింటాళ్ల విత్తనాల కోసం రిజిస్టర్ చేయించుకున్నారు. వీరంతా బుధవారం విత్తనాలను తీసుకెళ్లేందుకు వచ్చారు. అక్కడే బ్యాగుల్లోని శనగ విత్తనాలను పరిశీలించగా ముడతపడి, మట్టి పెళ్లలు, చిన్నచిన్న రాళ్లతో కలిసి నాణ్యత లేకపోవడంతో 'ఈ విత్తనాలు మాకొద్దు' అంటూ అక్కడే ఉన్న ఆలూరు ఏడీఏ సునీత, ఏఓ నరేంద్రకుమార్ దృష్టికి తీసుకెళ్లారు. అధికారులు వాటిని పరిశీలించి నాణ్యత లేవని నిర్ధారించుకుని ఆస్పరికి వచ్చిన 250 కింటాళ్ల లోడును ఏపీ సీడ్స్‌కు వెనక్కి పంపారు. నాణ్యమైన విత్తనాలు వచ్చిన తరువాతే రైతులకు పంపిణీ చేస్తామని ఏడీఏ, ఏఓ తెలిపారు. ఏమాత్రం గ్రేడింగ్ చేయకుండా విత్తనాలను ఎలా పంపిణీ చేస్తారని రైతులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నాసిరకం విత్తనాలు పొలాల్లో వేస్తే మొలకెత్తవని చెప్పారు. మండలానికి 6,300 క్వింటాళ్ల విత్తనాలు మంజూరు కాగా ఇప్పటి వరకు 1,248 మంది రైతు లు 2,112 క్వింటాళ్లకు రిజిస్టర్ చేయించుకున్నారు. ప్రభుత్వం విత్తన పంపిణీలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరి కాదని రైతులు పేర్కొంటున్నారు.

'బన్ని'లో నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

- జిల్లా ఎస్పీ బిందు మాధవ్

కర్నూలు: జిల్లాలో ప్రతిష్టాత్మకంగా జరిగే దేవరగట్టు మాళ మల్లేశ్వరస్వామి బన్ని ఉత్సవాల్లో నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్పీ బిందు మాధవ్ హెచ్చరించారు. దసరా పండుగ రోజు జరిగే ఈ వేడుకకు పోలీసు యంత్రాంగం అన్ని రకాల భద్రతా చర్యలు చేపట్టిందన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు అవకాశమివ్వకుండా ప్రశాంతంగా జరుపుకోవాలని బుధవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. 800 మంది పోలీసులతో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై పోలీసు యంత్రాంగం గట్టి నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అల్లర్లకు పాల్పడినా, కాగడాలు విసరడం వంటివి చేస్తే చట్ట పరిధిలో కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మద్యం సేవించి రింగుల కర్రలతో ఉత్సవంలో పాల్గొనడం వల్ల కలిగే దుష్పరిణామాలపై దేవరగట్టు చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఏడుగురు డీఎస్పీలు, 42 మంది సీఐలు, 54 మంది ఎస్‌ఐలు, 112 మంది ఏఎస్‌ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, 362 మంది కానిస్టేబుళ్లు, 50 మంది స్పెషల్ పార్టీ పోలీసులు, మూడు ప్లటూన్ల ఏఆర్ పోలీసులు, 95 మంది హోంగార్డులను బన్నీ ఉత్సవ బందోబస్తు విధులకు నియమించినట్లు పేర్కొన్నారు.

డీపీఓ ఏఓగా రత్నకుమార్

జిల్లా పోలీసు కార్యాలయ పరిపాలన అధికారిగా సి.రత్నకుమార్ నియమితులయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా సివిల్ ఏపీఎస్పీ విభాగాల్లో పనిచేస్తున్న 18 మంది ఏఓలకు స్థానచలనం కల్పిస్తూ ఏపీ డీజీపీ ద్వారకా తిరుమల రావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా గ్రేహౌండ్స్ విభాగంలో పనిచేస్తున్న రత్నకుమార్ కర్నూలుకు నియమితులయ్యారు. ఇక్కడున్న ఏఓ సురేష్ బాబు ఏడాది క్రితం హెడ్‌క్వార్టర్‌కు బదిలీ అయ్యారు. అప్పటి నుంచి డీపీఓ పరిపాలన ఇన్‌చార్జ్ పాలనలో కొనసాగుతోంది.

వంద రోజుల ప్రణాళిక లక్ష్యాలను సాధించాలి

- కలెక్టర్ రంజిత్‌బాషా



మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): డిసెంబర్ 31వ తేదీలోపు రెండో దశ వంద రోజుల ప్రణాళిక లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రెండో దశ వంద రోజుల ప్రణాళిక లక్ష్య సాధనపై ఆయన అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వ్యవసాయశాఖకు సంబంధించి విత్తన పంపిణీ, పొలం పిలుస్తోంది కార్యక్రమాలను నిర్దేశించిన లక్ష్యాల మేరకు చేపట్టేలా జిల్లా వ్యవసాయాధికారి పీఎల్ వరలక్ష్మిని ఆదేశించారు. 200 ఎకరాల్లో ఉద్యాన పంటలను వృద్ధి చేయాలని, ఎన్ఆర్ఈజీఎస్ కింద చేపడుతున్న 1,200 గోకులాలను పూర్తి చేయాలని డ్వామా అధికారులను ఆదేశించారు. సూర్య ఘర్ ముఫ్త్ బిజిలి యోజన కింద ఎక్కువ మంది వినియోగదారులకు సోలార్ విద్యుత్‌ను అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ శాఖ ద్వారా ఉపాధిని కల్పించాలన్నారు. కర్నూలు కార్పొరేషన్ మెయిన్ రోడ్లలో ఉన్న గుంతలను పూడ్చిందేకు ప్యాచ్ వర్కులు చేపట్టాలన్నారు. పీఆర్‌కు సంబంధించి రూ. 52 కోట్లతో పల్లె పండుగ ద్వారా చేపడుతున్న 70 కిలోమీటర్ల సీసీ రోడ్లను సంక్రాంతి లోపు పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఓ హిమ ప్రభాకరరాజు, డీఆర్వో చిరంజీవి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

భ్రామరీ దర్శనం.. నేత్రానందభరితం



గజ వాహన సేవ పూజలు నిర్వహిస్తున్న పండితులు

శ్రీశైలంటెంపుల్: అష్టాదశ శక్తిపీఠమైన శ్రీశైల మహాక్షేత్రంలో దసరా నవరాత్రోత్సవాలు నేత్రానందభరితంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో ఏడవరోజు బుధవారం భ్రమరాంబాదేవి ఉత్సవమూర్తిని కాళరాత్రి స్వరూపంలో అలంకరించారు.చూడటానికి అత్యంత భయంకరంగా కనిపిస్తున్న అమ్మవారు సర్వదా శుభాలను ప్రసాదిస్తుంది.

గజ వాహనంపై పార్వతీ పరమేశ్వరులు

దసరా మహోత్సవాల్లో భాగంగా భ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను గజ వాహనంపై అలంకరించారు. గజ వాహనంపై కొలువుదీరిన పార్వతీపరమేశ్వరులను అలంకార మండపంలోకి ఆశీనులను చేయించి అర్చకులు, వేదపండితులు వేదమంత్రోచ్చరణల మధ్య ప్రత్యేక పూజా హారతులిచ్చారు. స్వామిఅమ్మవార్లను భక్తులు దర్శించుకుని నీరాజనాలు సమర్పించారు. దేవస్థాన కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు దంపతులు పాల్గొన్నారు.

శ్రీశైలంలో నేడు..

దసరా ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదవ రోజు గురువారం భ్రమరాంబాదేవి మహాగౌరి అలంకారంలో, భ్రమరాంబా సమేత మల్లికార్జున స్వామిఅమ్మవార్లు నందివాహనంపై భక్తులకు దర్శనమివ్వనున్నారు.

మానసిక కల్లోలం

మానసిక వైద్యుడి వద్దకు వెళ్లాలంటే నాకేమైనా పిచ్చి ఉందా? అని ప్రశ్నించి వెళ్లేవారు కాదు ఒకప్పుడు. ఇప్పుడు పిచ్చిగా ప్రవర్తించడమే కాదు పలు రకాల సమస్యలకు మానసిక అనారోగ్యమే కారణమని అవగాహన పెరగడంతో మానసిక వైద్యుల వద్దకు వెళ్లే వారి సంఖ్య ఇటీవల కాలంలో పెరిగింది. ప్రస్తుత సమాజ పరిస్థితుల దృష్ట్యా మానసిక సమస్యలతో బాధపడే వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ఈ నెల 10వ తేదిన 'ప్రపంచ మానసిక ఆరోగ్య దినం' సందర్భంగా ప్రత్యేక కథనం.

- పెరుగుతున్న మానసిక వ్యాధిగ్రస్తులు
- నిరుద్యోగం, కుటుంబ సమస్యలు, చదువు, ఉద్యోగ ఒత్తిళ్లే కారణం
- అధికంగా డిప్రెషన్, స్క్రిజోఫినియా, మానియా, యాంగ్జైంటీ సమస్యలు
- నేడు ప్రపంచ మానసిక ఆరోగ్య దినం

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలో 20 ఏళ్ల క్రితం ఒకరిద్దరు మాత్రమే మానసిక వ్యాధి చికిత్సా నిపుణులు ఉండేవారు. ప్రస్తుతం కర్నూలు నగరంతో పాటు ఆదోని, నంద్యాల, డోన్‌లో 35 మందికి పైగా సైకియాట్రిస్టులు ఉన్నారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని మానసిక వ్యాధుల విభాగం ఓపీకి ప్రతిరోజూ 90 నుంచి 100 మంది రోగులు వస్తుండగా అందులో 20 మంది కొత్తవారు ఉంటున్నారు. ఇక ప్రైవేటు వైద్యుల వద్దకు సైతం సగటున ప్రతిరోజూ 30 నుంచి 50 మంది దాకా రోగులు చికిత్స కోసం వెళ్తున్నారు. సమాజంలో తీవ్రమైన మానసిక సమస్యలు(స్క్రిజోఫీనియా, మానియా, డిప్రెషన్స్ అతిగా మద్యపానం, మత్తుపదార్థాలు సేవించడం) వారు 5 శాతం, ఇతర మానసిక వ్యాధులు ఉన్న వారు 15 నుంచి 20 శాతం వరకు ఉంటారని వైద్యులు చెబుతున్నారు. లక్షణాలు గుర్తించి వెంటనే మానసిక వైద్యులను సంప్రదిస్తే రోగికి కౌన్సెలింగ్ ద్వారా, మందుల ద్వారా నయం చేయవచ్చని వారు సూచిస్తున్నారు.

మానసిక వ్యాధులకు కారణాలు

- శారీరక, జన్యుపర, వంశానుగత అంశాలు
- పెరిగిన వాతావరణం, కుటుంబ పరిస్థితులు, చెడు స్నేహాలు
- తలకు బలమైన గాయాలు కావడం, నాడీ వ్యవస్థలో తలెత్తే లోపాలు

మానసిక ఒత్తిడి వల్లే అనారోగ్యం

మానసిక ఒత్తిడి వల్ల కడుపులో గ్యాస్ (వాయువు), ఆవేశకావేశాల వల్లే అధిక రక్తపోటు, అతిబద్ధకం వల్ల చెడు కొలెస్ట్రాల్ ఎక్కువగా పెరగడం, స్వార్థం, మొండితనం వల్ల డయాబెటీస్ (మధుమేహం), అతి విచారం వల్ల ఆస్తమా, ప్రశాంతత లోపించడం వల్లే గుండె కొట్టుకోవడంలో మార్పులు వస్తున్నాయని ఇటీవల వైద్యులు గుర్తించారు. శరీరంలో వచ్చే సర్వరోగాలకు మూలకారణాలు తరచిచూస్తే ఆహార అలవాట్లతో పాటు అధిక శాతం జీవనశైలి సంబంధమైనవేనని తెలుస్తోంది.



మానసిక వ్యాధి లక్షణాలు

ఆందోళన, భయం, గుండె దడ, అధిక చెమట, కాళ్లు, చేతులు వణకడం, అనవసర ఆలోచనలు, చేసిన పనులే మళ్లీ మళ్లీ చేయడం, విచారం, పనిలో ఉత్సాహం లేకపోవడం, ఆకలి, నిద్ర లేకపోవడం, ఆత్మహత్యా ఆలోచనలు, మతిమరుపు, జ్ఞాపకశక్తి తగ్గడం, ప్రవర్తనలో మార్పు, తనలో తానే నవ్వుకోవడం, మాట్లాడుకోవడం, ఇతరులను అనుమానించడం, అతి ఆనందం, అతికోపం, ముసలితనంలో వచ్చే సమస్యలు, కలత నిద్ర, నిద్ర పట్టకపోవడం, నిద్రలో నడవటం, మాట్లాడటం, మూత్రవిసర్జన చేయడం, భయంకర కలవరింతలు, నిగ్రహశక్తి కోల్పోవడం వంటివి ప్రధాన లక్షణాలు

పెద్దాసుపత్రిలో ఈ యేడాది నమోదైన మానసిక వ్యాధి కేసులు

నెల	పాత కేసులు	కొత్త కేసులు	మొత్తం
జనవరి	1,582	643	2225
ఫిబ్రవరి	1491	599	2090
మార్చి	1479	567	2046
ఏప్రిల్	1544	514	2058
మే	1555	505	2060
జూన్	1604	490	2094
జులై	1683	616	2269
ఆగస్టు	1694	688	2322
సెప్టెంబర్	1848	663	2511

ఉదయం ఉల్లాసంగా గడపండి

పొద్దున్నే వాకింగ్‌కు వెళ్లేవారు ప్రశాంతమైన మూడ్‌లో ఉండేందుకు నచ్చిన పాటలు వినాలి. వాకింగే కాదు ఉల్లాసంగా ఉండేందుకు ఏం చేస్తే బాగుంటుందో అదే చేయాలి. కొందరు వాకింగ్ ఇష్టపడితే మరికొందరు జిమ్‌కు వెళ్లాలంటున్నారు. ఇంకొందరు యోగా, ధ్యానం ఇష్టపడతారు. అందుకే డాక్టర్లు పేషంట్ల ఇష్టానికే విడిచిపెట్టి ఎంతో కొంత వ్యాయామం మాత్రం చేయాలని సూచిస్తున్నారు.

పెరుగుతున్న మానసిక వ్యాధిగ్రస్తులు



ఇటీవల కాలంలో పెద్దవారితో పాటు యువతలోనూ మానసిక సమస్యలు పెరుగుతున్నాయి. ఆర్థిక సమస్యలతో పాటు కుటుంబ సమస్యలు, నిరుద్యోగం, వివాహం కాకపోవడం, సోషల్ మీడియా ప్రభావం ఎక్కువగా ఉంటోంది. ప్రధానంగా ఆల్కహాలు అడిక్షన్, డిప్రెషన్, స్కిజో ఫ్రీనియా, మానియా, యాంగ్జైటీ, ఆత్మహత్యాయత్నం చేయడం వంటి సమస్యలతో వస్తున్నారు. వీరికి కౌన్సెలింగ్‌తో పాటు కొన్ని నెలల పాటు మందులు ఇవ్వడంతో బాగవుతున్నారు. ఈ విభాగంలో ఒక ప్రొఫెసర్, ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ఇద్దరు సీనియర్ రెసిడెంట్లతో పాటు రెండు పీజీ సీట్లు రావడంతో ఇద్దరు వైద్య విద్యార్థులు సేవలందిస్తున్నారు. ఇక్కడ కౌన్సెలింగ్, చికిత్స, మందులు ఉచితంగా లభిస్తాయి.

– డాక్టర్ నాగేశ్వరరావు, మానసిక వ్యాధుల విభాగాధిపతి, పెద్దాసుపత్రి, కర్నూలు

యోగా, ప్రాణాయామంతో ప్రశాంతత



యోగాసనాల్లో సూర్య నమస్కారాలు ఐదుసార్లు చేస్తే మంచి నిద్ర, ఆలోచనలు వస్తాయి. పశ్చిమోత్తాసనం, ప్రసారిత పాద ఉత్తానాసనం చేయడం వల్ల రక్తప్రసరణ బాగా జరిగి మెదడు చురుగ్గా పనిచేస్తుంది. ఇది చేయలేనివారు శశాంకాసనం చేస్తే చాలు. ఇక ప్రాణాయామాల్లో చంద్రబేదన 10 నిమిషాలు చేస్తే మనసులో ఆలోచనల సంఖ్య తగ్గుతుంది. భ్రామరి, ఓంకార ప్రాణాయామాలు 20 సార్లు చేయడం వల్ల చెడు ఆలోచనలు తగ్గి మంచి నిద్ర పడుతుంది.

– జి.మురళీకృష్ణ, యోగా మాస్టర్, కర్నూలు

క్లుప్తంగా

బ్యాంకు ఖాతాలోని నగదు మాయం



బాధితుడు ఉప్పరి గౌతమ్‌కుమార్

పాణ్యం: మండల పరిధిలోని గోరుకల్లు గ్రామానికి చెందిన ఉప్పరి గౌతమ్‌కుమార్ బ్యాంకు ఖాతా నుంచి రూ.9, 991 నగదు మాయమైంది. దీనిపై బాధితుడు బుధవారం మాట్లాడుతూ.. తనకు పోలూరు గ్రామంలోని యూనియన్ బ్యాంక్‌లో ఖాతా ఉందని చెప్పారు. ఖాతాలో రూ.50 వేలు ఉండగా ఇటీవలే రూ.40 వేలు విత్‌డ్రా చేశానని, మిగతా సొమ్ము రూ.10 వేలు ఉండగా అందులో రూ.9,991 నగదు మాయమైందన్నారు. ఈ విషయాన్ని బ్యాంకు మేనేజర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు బాధితుడు చెప్పా రు. తనకు ఎలాంటి ఓటీపీ గానీ, నకిలీ ఫోన్‌కాల్స్ గానీ రాలేదని, అయినా ఖాతాలోని నగదు మాయమైనట్లు వాపోయారు.

ఎంబ్రాయిడరీలో ఉచిత శిక్షణ

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు, నంద్యాల జిల్లాలోని గ్రామీణ ప్రాంత మహిళలకు కెనరా బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ మగ్గం, ఎంబ్రాయిడరీ ఫ్యాబ్రిక్ పెయింటింగ్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ఈ సంస్థ డైరెక్టర్ కే.పుష్పక్ తెలిపారు. ఇందుకు సంబంధించి 30 రోజుల పాటు శిక్షణ ఇస్తున్నట్లు ఆయన బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 18 – 45 ఏళ్లలోపు వయస్సు ఉండి చదవడం, రాయడం వచ్చి ఉండాలని, శిక్షణా కాలంలో ఉచితంగా భోజనం, హాస్టల్ వసతి కల్పించబడుతుందని తెలిపారు. ఆసక్తి కలిగిన మహిళలు ఆరు ఫొటోలు, రేషన్‌కార్డు, ఆధార్, బ్యాంకు ఖాతా జిరాక్స్ కాపీలు, విద్యార్హత ధ్రువపత్రాల జిరాక్స్‌లతో సంస్థ యందు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు కల్లూరు తహసీల్దారు కార్యాలయం పక్కన కెనరా బ్యాంకు హౌసింగ్ బోర్డు బ్రాంచీ పైన (మూడవ అంతస్తు) లేదా 63044 91236 నంబరుకు ఫోన్ చేయవచ్చని తెలిపారు. ఆసక్తి కలిగిన మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఆర్మీ ఉద్యోగిపై పోక్సో కేసు

డోన్ టౌన్: ఓ ఆర్మీ ఉద్యోగిపై బుధవారం పోక్సో చట్టం కింద కేసు నమోదైంది. పట్టణ సీఐ ఇంతియాజ్ బాషా తెలిపిన వివరాలు.. మండలంలోని యు.కొత్తపల్లె గ్రామానికి చెందిన ఆర్మీ ఉద్యోగి సుధీర్‌కుమార్ అదే గ్రామానికి చెందిన బాలికను పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడు. దీంతో బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు.

భక్తుడి మృతదేహం లభ్యం



మృతుడు సుబ్బరాయప్ప

నందవరం/మంత్రాలయం: తుంగభద్రా నదిలో గల్లంతైన భక్తుడి మృతదేహం బుధవారం లభ్యమైంది. మంత్రాలయం రాఘవేంద్రస్వామి దర్శనార్థం వచ్చిన ఓ భక్తుడు మంగళవారం నదీస్నానానికి వెళ్లి వరద నీటిలో కొట్టుకుపోయిన విషయం విధితమే. కర్ణాటకలోని చిక్‌బళ్లాపూర్ జిల్లా ద్వారగనహళ్లికి చెందిన సుబ్బరాయప్ప (41) నది ప్రవాహంలో గల్లంతయ్యారు. బుధవారం నందవరం మండలం జొహరాపురం-గంగవరం మధ్య భాస్కర్‌కు చెందిన వరి పొలం వద్ద మృతదేహం కనిపించింది. నందవరం పోలీసులకు సమాచారం అందించగా మృతదేహాన్ని వెలికి తీశారు. పంచనామా నిర్వహించి బాధితులకు మృతదేహాన్ని అప్పగించనున్నట్లు పోలీసులు తెలిపారు.

గొలుసు దొంగల హల్‌చల్

కర్నూలు: నగర శివారులోని ఓల్డ్ హౌసింగ్ కాలనీలో గొలుసు దొంగలు చేతివాటం ప్రదర్శించారు. కాలనీలో నివాసముంటున్న నాగశివయ్య సతీమణి నాగలక్ష్మి (60) బుధవారం ఉదయం 6 గంటల సమయంలో ఇంటి ముందు పూలు తెంపుతుండగా మాస్క్ ధరించిన ఇద్దరు వ్యక్తులు ఆమెను సమీపించి మెడలోని మూడు తులాల పుస్తెల గొలుసును లాక్కెళ్లారు. ఆమె కేకలు వేయగా వాహన వేగాన్ని పెంచి కనిపించకుండా పరారయ్యారు. పెనుగులాటలో గొలుసును దొంగలు లాక్కెళ్లగా పుస్తెలు కింద పడిపోయాయి. వెంటనే మూడవ పట్టణ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీఐ మురళీధర్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.ఆ ప్రాంతంలోని సీసీ పుటేజీల ఆధారంగా దొంగల చిత్రాలను సేకరించారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దొంగల కోసం గాలిస్తున్నట్లు సీఐ తెలిపారు.


రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు ప్రారంభం



తలపడుతున్న క్రీడాకారులు

చాగలమర్రి: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో బుధవారం రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు ప్రారంభమయ్యాయి. కర్నూలు-నంద్యాల జట్ల మధ్య జరిగిన ప్రారంభోత్సవ మ్యాచ్‌లో నంద్యాల జిల్లా జట్టు విజేతగా నిలిచింది. 13 జిల్లాల జట్లు పాల్గొనగా మొదటి రోజు 15 లీగ్ మ్యాచ్‌లు నిర్వహించినట్లు నిర్వాహకులు పీడీలు దాదాపీర్, షేక్షావలి తెలిపారు. ఈస్ట్ గోదావరి జిల్లా జట్టుతో తలపడిన నంద్యాల జిల్లా జట్టు 02-10 పాయింట్లతో, ప్రకాశం జిల్లా జట్టుతో తలపడిన కర్నూలు జిల్లా జట్టు 04-16 పాయింట్ల తేడాతో గెలుపొందాయి. రెండవ రోజు క్వార్టర్ ఫైనల్, సెమీ ఫైనల్, ఫైనల్ పోటీలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో హ్యాండ్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఇదోరకం మోసం



ఎక్కువ సొమ్ము చెల్లించినట్లు హోటల్ యజమానికి పంపిన నకిలీ స్క్రీన్ షాట్

హోటల్ యజమానికి పంపిన ఫేక్ మెసేజ్

ఆదోని అర్బన్: ఆదోనిలో కొత్త తరహా మోసం ఆలస్యంగా వెలుగుచూసింది. వివరాలు.. స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డు సమీపంలోని గౌడ హోటల్‌లో మంగళవారం రాత్రి 9 గంటలకు ఓ వ్యక్తి 20 మీల్స్ ఆర్డర్ చేశాడు. యజమాని పార్శిళ్లను రెడీ చేసి వచ్చి తీసుకెళ్లాల్సిందిగా ఆ వ్యక్తికి ఫోన్ చేసి చెప్పాడు. బిల్లు రూ.1880 అయ్యిందని చెప్పగా ఆ వ్యక్తి పొరపాటున రూ.11,880 పంపినట్లు మెసేజ్‌తోపాటు నకిలీ స్క్రీన్ షాట్ పంపాడు. బిల్లు పట్టుకుని మిగతా రూ.10 వేలు చెల్లించాలని కోరాడు. యజమాని తనకు డబ్బు రాలేదని చెప్పగా అవతలి వ్యక్తి అతిగా మాట్లాడడమే గాక తాను ఆర్మీ ఉద్యోగి అని, డబ్బు పంపుతావా? లేదా నన్నే రమ్మంటావా? అని బెదిరించాడు. హోటల్ యజమాని పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి తేల్చుకుందాం రమ్మని చెప్పగా ఆ వ్యక్తి ఫోన్ స్విచాఫ్ చేసుకున్నాడు. దీనిపై పోలీసులు మాట్లాడుతూ.. హోటల్ యజమానులేగాక ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

ఫోన్‌పే ఫేక్ బిల్లు ఎలా వస్తుంది

ఫోన్‌పే లాగే ఉండే నకిలీ యాప్ ద్వారా డబ్బు పంపకపోయినా పంపినట్లు బిల్లు తయారుచేయవచ్చు. అవతలి వారి ఖాతాల్లో మాత్రం డబ్బు జమ కాదు. ప్రజలు ఇలాంటి ఫేక్ యాప్‌లపై అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు. ఎవరైనా డబ్బులు జమ చేసినట్లు చెబితే ఖాతాను చెక్ చేసుకుని నిర్ధారణకు రావాలని సూచిస్తున్నారు.

బాలిక కిడ్నాప్‌నకు యత్నం

ఆదోని అర్బన్: టీజీఎల్ కాలనీలో బుధవారం రాత్రి ఆరేళ్ల బాలికను కిడ్నాప్ చేసేందుకు గుర్తుతెలియని వ్యక్తులు యత్నించారు. కాలనీకి చెందిన లక్ష్మీకాంత్ ఆరేళ్ల కుమార్తె ఇంటి బయట ఆడుకుంటుండగా గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. పాప బిగ్గరగా ఏడవడంతో అదే రోడ్డులోని బీరప్ప గుడివద్ద వదిలేసి వెళ్లారు. ఈలోపు బాలిక కనిపించకపోవడంతో తల్లిదండ్రులు కాలనీ మొత్తం గాలించారు. కాసేపటికి బీరప్పగుడి వద్ద ఏడుస్తూ ఉన్న కుమార్తెను గుర్తించారు. ఘటనపై తల్లిదండ్రులు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

23న ప్రభుత్వ నర్సుల సంఘం ఎన్నికలు

కర్నూలు(హాస్పిటల్): ఏపీ ప్రభుత్వ నర్సుల సంఘం జిల్లా కార్యవర్గ ఎన్నికలు ఈ నెల 23వ తేదీన నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారిణి బి. చెన్నమ్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో మొత్తం 321 మంది ఓటర్లు ఉన్నారన్నారు. ఎన్నికలకు సంబంధించి ఓటర్ జాబితాను 8వ తేదీన ప్రచురించామని, అభ్యంతరాలను ఈ నెల 13వ తేదీ వరకు సమర్పించుకోవచ్చన్నారు. తుది జాబితాను 14వ తేదిన ప్రకటిస్తామన్నారు. ఎన్నికలకు సంబంధించి నామినేషన్లను 16వ తేదిన, నామినేషన్ల స్క్రూటీని 17న, నామినేషన్ల విత్‌డ్రా 18న ఉంటుందన్నారు. 23వ తేదిన ఎన్నికలు నిర్వహించి, అదే రోజు కౌంటింగ్ నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ప్రకటిస్తామన్నారు. ఎన్నికల్లో ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్, సెక్రటరీ, ట్రెజరర్‌తో పాటు ఐదు ఈసీ మెంబర్ పోస్టులకు ఎన్నికలు జరుగుతాయన్నారు. ఎన్నికైన నూతన కార్యవర్గం మూడేళ్లపాటు కొనసాగుతుందన్నారు.

మహిళ ఆత్మహత్య


బనగానపల్లె: భర్త వేధింపులు భరించలేక భార్య ఉరివేసుకొని మృతి చెందినట్లు ఎస్‌ఐ బీటీ వెంకటసుబ్బయ్య బుధవారం తెలిపారు. జమ్మలమడుగు గ్రామానికి చెందిన శకుంతల(34)కు, జిల్లెల్ల గ్రామానికి చెందిన బలరాముడుకు 17 ఏళ్ల క్రితం వివాహం అయింది. వివాహమైనప్పటి నుంచి శకుంతలను భర్త మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురి చేసేవాడు. వేధింపులు తాళలేక రాత్రి శకుంతల ఉరివేసుకొని బలవన్మరణం చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతురాలి సోదరుడు కన్నె సుధాకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఆకతాయికి జైలు శిక్ష

నంద్యాల (వ్యవసాయం): మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న ఆకతాయికి బుధవారం సెకెండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రామిరెడ్డి గారి రాంభూపాల్ రెడ్డి జైలు శిక్ష విధించినట్లు టూ టౌన్ పోలీసులు తెలిపారు. కర్ణాటక రాష్ట్రం బళ్లారికి చెందిన గురుమహారాజ్ (50) గిరినాథ్ సెంటర్‌లో ఈలలు, సైగలు, కేకలు వేస్తూ మహిళల పట్ల అసభ్యకరంగా వ్యవహరిస్తుండటంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. టూ టౌన్ పోలీసులు అక్కడికి చేరుకుని నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచగా విచారణ అనంతరం జడ్జి 15 రోజులు జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

వ్యవసాయ పరిజ్ఞానంపై శిక్షణ

కర్నూలు(అగ్రికల్చర్): వాతావరణ మార్పులపై ఇన్‌పుట్ డీలర్లు అవగాహన పెంచుకొని రైతులకు తెలియజెప్పాలని ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ రత్నప్రసాద్ సూచించారు. బుధవారం ఆత్మ ఆధ్వర్యంలో దేశీ డిప్లొమా కోర్సు నూతన బ్యాచ్ ఇన్‌పుట్ డీలర్లకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. డీలర్లకు ఉద్యాన పంటలకు సంబంధించిన పంచాంగాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ పరిజ్ఞానాన్ని పెంచుకునేందుకు దేశీ డిప్లొమా కోర్సులో శిక్షణ పొందడం చక్కటి అవకాశమని తెలిపారు. తద్వారా రైతులకు నాణ్యమైన సేవలు అందించవచ్చని పేర్కొన్నారు. వాతావరణ మార్పులపై రైతులకు ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తే వారు నష్టపోకుండా జాగ్రత్తలు తీసుకునే అవకాశం ఉంటుందని వివరించారు. రైతులు ఆధునిక సాంకేతిక పద్ధతులు పాటించే విధంగా ప్రోత్సహించాలన్నారు. ఆత్మ డీపీడీ శ్రీలత, విశ్రాంత డీడీఏ, దేశీ కార్యక్రమ సమన్వయకర్త నాగేంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



ఉద్యాన పంటల పంచాగాన్ని పంపిణీ చేస్తున్న ఆత్మ పీడీ రత్నప్రసాద్ తదితరులు

యువకుడి దుర్మరణం

డోన్ టౌన్: జాతీయ రహదారిపై యు.కొత్తపల్లె గ్రామ సమీపంలో బుధవారం గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అనంతరపురం జిల్లా పెద్దవడుగూరు మజరా ముప్పావల గుత్తి గ్రామానికి చెందిన నీలూరు ఓబులపతి (28) దుర్మరణం చెందాడు. ఓబులపతి నిమ్మకాయలను ఆటోలో కర్నూలు వైపు తరలిస్తుండగా డోన్ సమీపంలోని కొత్తపల్లె వద్ద ఆటో పంక్చర్ అయ్యింది. రోడ్డు పక్కకు ఆపి దిగి పరిశీలిస్తుండగా గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి వచ్చి ఓబులపతిని ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

కోలుకోలేక బీటెక్ విద్యార్థిని మృతి

బొమ్మలసత్రం: ప్రేమించిన యువకుడు పెళ్లికి నిరాకరించాడనే మనస్తాపంతో పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన బీటెక్ విద్యార్థిని కర్నూలు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక బుధవారం మృతిచెందింది. తాలూకా ఎస్‌ఐ నజీర్‌హుస్సేన్ తెలిపిన వివరాలు.. నంద్యాల మండలం పొన్నాపురం గ్రామానికి చెందిన చిన్న వెంకటేశ్వర్లు, కాంత దంతపతుల కుమార్తె శశికళ(20) తిరుపతి పద్మావతి యూనివర్సిటీలో బీటెక్ ఫోర్త్ ఇయిర్ చదువుతోంది. దసరా పండగ సెలవుల నిమిత్తం ఐదు రోజుల క్రితం నంద్యాలకు వచ్చింది. కాగా రెండేళ్లుగా నంద్యాలకే చెందిన కోటరెడ్డి ప్రసాద్‌తో ప్రేమ వ్యవహారం కొనసాగిస్తోంది. అతడు పెళ్లికి నిరాకరించడంతో ఈనెల 6న ఇంట్లో పురుగు మందు తాగింది. కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం నంద్యాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచనలతో కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ కోలుకోలేక మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఎస్‌ఐ తెలిపారు.

పోక్సో కేసులో నిందితుడి అరెస్ట్

ఆదోని అర్బన్: డోన్‌కు చెందిన కృష్ణ అనే యువకుడిని పోక్సో కేసులో అరెస్టు చేసినట్లు టూటౌన్ సీఐ సూర్యమోహనరావు బుధవారం తెలిపారు. నిందితుడు పట్టణంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ మైనర్ బాలికకు మాయమాటలు చెప్పి తీసుకెళ్లాడని చెప్పారు. బాలికల తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గత నెల 29వ తేదీన పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. బుధవారం ఆస్పరి రోడ్డులో కృష్ణను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు వెల్లడించారు.

వైభవంగా బంగారు పల్లకీ సేవ



బంగారు పల్లకీ సేవలో సేవా భక్తులు

మంత్రాలయం: రాఘవేంద్రస్వామి మఠంలో బంగారు పల్లకీ సేవ వైభవంగా జరిగింది. బుధవారం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ఆశీస్సులతో రాఘవేంద్రుల బృందావన ప్రతిమకు ముందుగా ఊంజల మండపంలో విశేష పూజలు నిర్వహించారు. అనంతరం మంగళవాయిద్యాలతో శ్రీమఠం ప్రాంగణ వీధుల్లో, భక్తజనం మధ్య ఎంతో రమణీయంగా స్వర్ణపల్లకీ సేవ గావించారు.

ప్రతిభా పురస్కారానికి ఎంపిక



అన్వర్ హుసేన్

కర్నూలు కల్చరల్: కర్నూలు ఉస్మానియా కళాశాల తెలుగు శాఖ అధ్యక్షుడు డాక్టర్ మండి అన్వర్ హుసేన్ డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జాతీయ ప్రతిభా అవార్డుకు ఎంపికయ్యారని సౌథర్న్ ప్రైవేట్ లెక్చరర్స్ టీచర్స్ ఆర్గనైజేషన్ (ఎస్‌పీఎల్‌టీఓ) గౌరవాధ్యక్షుడు, ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, అధ్యక్షుడు డాక్టర్ పి.నాగయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20వ తేదీన గుంటూరులో నిర్వహించే కార్యక్రమంలో అవార్డు ప్రదానం జరుగుతుందని చెప్పారు. అన్వర్ హుసేన్ సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవారని సాహిత్య రంగంలో నాలుగు పుస్తకాలు, 29 పరిశోధనా పత్రాలను ప్రచురించారని, 10 జాతీయ, అంతర్జాతీయ సదస్సులను నిర్వహించారని, 2019లో రాష్ట్ర ఉత్తమ అధ్యాపక అవార్డుతో పాటు అనేక పురస్కారాలను అందుకున్నారని వివరించారు.

పిడుగుపాటుకు కోడెదూడ మృతి



మృతి చెందిన కోడెదూడ

తుగ్గలి: పిడుగు పాటుకు కోడెదూడ మృతి చెందిన ఘటన తుగ్గలి మండలం బొందిమడుగులలో చోటు చేసుకుంది. వివరాలు .. గ్రామానికి చెందిన రైతు మునిస్వామి బుధవారం కోడెదూడలను పొలం వద్ద మేపుతున్నాడు. మధ్యాహ్నం ఉరుములతో కొద్దిపాటి వర్షం కురిసింది. ఆ సమయంలో ఆకస్మాత్తుగా పిడుగు పడడంతో ఒక కోడెదూడ మృతి చెందింది.కోడెదూడ మృతితో రూ.80 వేల దాకా నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయాడు.